దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కోనపాపపేట గ్రామానికి చెందిన పి.పావని దాతల సాయం కోసం ఎదురుచూస్తుంది. గత కొన్నేళ్లుగా ఆ యువతి బోన్‌మారో ట్రాన్స్‌లేషన్ బాధతో బాధపడుతుంది. విశాఖపట్నంలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె ఆపరేషన్‌కి భారీగా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఏమీ చేయలేని నిరాశతో కుటుంబ సభ్యులు పావనిని ఇంటికి తీసుకొచ్చారు. ఆమె వైద్యానికి రూ.50 లక్షలు వరకూ ఖర్చు అవుతుందని, ఎవరైనా దాతలు సాయం చేయాలని కోరుతున్నారు. సాయం చేసే వారు 9441382969 సంప్రదించాలని కోరారు.



బెడ్‌పై ఉన్న పావని



వేసవి సెలవులు కూడా ఇంకా మొదలు కాలేదు... కాని కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దందాను మొదలు పెట్టేశాయి. జూన్ 12న విద్యాసంస్థలు పునఃప్రారంభమవుతాయి. దీనికి ఇంకా 50 రోజులపైనే గడువు ఉంది. కాని ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల వేటకు దిగాయి. భారీగా ఫీజులు గుంజడానికి రంగం సిద్ధం చేసుకున్నాయి. తల్లిదండ్రులను మభ్యపెట్టడానికి ఇప్పటికే ఏజెంట్లు, సిబ్బంది వాడవాడలా తిరుగుతున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కార్పొరేట్ 'వల' విసురుతున్నాయి. పేరెంట్స్‌పై ఒత్తిళ్లు పెంచుతున్నారు. ప్రభుత్వ పెద్దలే విద్యారంగాన్ని శాసిస్తున్న సమయంలో సామాన్యుడు సమిధగా మారాల్సిన పరిస్థితి కనిపిస్తోంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

.కాకినాడ జిల్లాలో 800 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, 70 వరకూ జూనియర్, 50 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. తొలి నాళ్లలోనే కాకినాడ, తుని, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం ఇలా ప్రధాన కేంద్రాలన్నింటిలో వివిధ సంస్థల బ్రాంచీలు వెలిశాయి. గడిచిన పదేళ్లలో అవి మరింతగా విస్తరించాయి. సాధారణ మండల కేంద్రాల్లోనూ బ్రాంచీలు ఏర్పాటు చేసి విద్యారంగాన్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకున్నట్టు కనిపిస్తోంది. దానికి తగ్గట్టుగానే ఫీజులు ఏకపక్షంగా పెంచేస్తున్నాయి.

నిబంధనలు తూచ్

విద్యాహక్కు చట్టం ప్రకారం అనేక నిబంధనలున్నప్పటికీ ఎక్కడా అమలు కావట్లేదు. ఒత్తిడి లేని విద్య అంటూనే విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. అంతకన్నా ముందే విద్యార్థుల తల్లిదండ్రులను వలలో వేసుకునేందుక ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ప్రయవేటు విద్యా సంస్థల్లో 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలని, ఫీజుల వివరాలు బహిరంగంగా వెల్లడించాలని, విద్యాసంస్థలోనే యూనిఫారం, పుస్తకాలు వంటి వ్యాపారాలు చేయకూడదని వంటి నిబంధనలు అమలైన దాఖలాలు ఎక్కడా లేవు. అధికారులు సైతం అమలు చేయడానికి కనీస ప్రయత్నాలు కూడా లేవనే విమర్శలున్నాయి.

భారీగా ఫీజులు

ఎల్‌కెజిలోనే సుమారుగా రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకూ ఫీజులు వసూలు చేయడానికి రంగం సిద్ధమైంది. కార్పొరేట్ కాలేజీల ఫీజులకు ఏమాత్రం తగ్గకుండా సాధారణ ప్రయివేటు విద్యాసంస్థలు సైతం ఫీజులు పెంచేస్తున్నాయి. గ్రామాల్లోని ప్రయివేటు స్కూళ్లలోనూ కనీసంగా రూ.20 వేలకు తగ్గడం లేదు. ఇంటర్నేషనల్ స్కూళ్లలో అయితే రూ.1 లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. కాకినాడలోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో ఫీజు, బస్ ఫీజు కలిపి రూ.2 లక్షలు దాటిపోతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కాన్సెప్ట్, ఐఐటీ, మెడల్ స్కూళ్లంటూ రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో సాధారణ తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అడ్మిషన్ల ఫీజు, కంప్యూటర్ ఫీజులు అధికం. అంతేగాకుండా యూనిఫారం కూడా స్కూళ్ల యాజమాన్యాలే అమ్ముకుంటూ విద్యా సంస్థను వ్యాపార కేంద్రంగా మార్చేశాయి. ఇక పుస్తకాల అమ్మకాలయితే మరింత జోరుగా సాగుతోంది. పైగా ఎవరికి వారే సొంతంగా పుస్తకాలు ముద్రించుకుని, వాటిని మాత్రమే కొనాలంటే బహిరంగ మార్కెట్లో సైతం దొరకని పుస్తకాలు అంటగడుతున్నారు.

నియంత్రణ కరువు

ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కనీసం చట్టం ప్రకారం నిబంధనలు పాటించేలా దృష్టి పెడితే కొంతలో కొంతయినా అదుపు చేయగలిగే అవకాశం ఉండేది. కానీ దానికి భిన్నంగా పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో తల్లిదండ్రులకు తలనొప్పిగా మారుతోంది. విద్యా వ్యాపారాలకు అడ్డు లేకుండా పోతోంది.

అడ్మిషన్ల దందాపై నియంత్రణ ఉండాలి

ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటింటా తిరిగి అడ్మిషన్లు నిర్వహించడం దుర్మార్గం. అడ్మిషన్ తీసుకొస్తేనే విద్యాసంస్థల్లో తమ ఉద్యోగాలు ఉంటాయని లేకపోతే ఉండవని ప్రయివేట్ టీచర్లకు లక్ష్యాలను నిర్దేశించి మరీ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రోడ్లపాలు చేస్తున్నాయి. ఇప్పటినుంచే ఎంట్రన్స్ టెస్టులు పేరు చెప్పి రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ల దందాపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

-ఎం. సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

రైతులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

అన్నదాతకు అండగా సర్కారు

ప్రజాశక్తి - కాజులూరు

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులకు రాయితీపై 11 పవర్ టిల్లర్స్, ఏడుగురుకి స్ప్రేయర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 62 శాతం జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ రంగానికి రూ.43,402 కోట్లను బడ్జెట్లో కేటాయించిందని అన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ, ప్రకృతి వ్యవసాయం, రైతులకు వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, డిజిటల్ వ్యవసాయం, విత్తనాలకు రాయితీ, ఎరువుల సరఫరా, పంటల బీమా, ఉద్యానవన శాఖ, సహకార సంఘాలకు రుణాలు తదితర రంగాలకు అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చి బడ్జెట్లో కేటాయింపులు చేసి అన్నదాతను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి రైతాంగానికి మధ్య వారదులుగా వ్యవసాయ శాఖ అధికారులు ఉండి, రైతాంగం సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా రాయితీలపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి, మంత్రి సుభాష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపిడిఓ రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు యాళ్ళ వెంకటరమణ, సర్పంచులు కోమలి వెంకటరమణ, ప్రసన్న మౌనిక, టిడిపి మండల అధ్యక్షులు పేపకాయల నారాయణరావు, నాయకులు వనం వీరబ్రహ్మం, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థతో 'మద్దతు' కరువు

ప్రజాశక్తి - కాజులూరు

దళారి వ్యవస్థతో ధాన్యానికి మద్దతు ధర కరువైందని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. సోమవారం మండలంలోని కాజులూరు, ఒంటితాడి, చేదువాడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు, కౌలు రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. దళారుల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దళారులను నమ్మవద్దని రైతులను కోరారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రైతుల పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సరిపోక రైతులు అప్పుల పాలౌతున్నారని అన్నారు. రైతులకు గోనెసంచులను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభాకర్‌రావు, ఎస్.చంద్రరావు, వి.బాబ్జి, ఎస్.నూకరాజు, యాళ్ల పుల్లయ్య, ఎం.యాకోబు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలో సోమవారం నిర్వహించిన ఎపి మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 240 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వైఎస్‌వి.కిరణ్ తెలిపారు పరీక్షా కేంద్రంలో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఇఒ ఎస్‌వి.రమణ సందర్శించారు. పరీక్ష ఫలితాలను ఈ నెల 27వ తేదీన విడుదల తెలిపారు.

కొత్తపల్లిలో డైరెక్టర్ బుచ్చిబాబు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పెన మూవీ,.త్వరలో రాబోతున్న రామ్‌చరణ్ పెద్ది మూవీ డైరెక్టర్ సానా బుచ్చిబాబు సోమవారం కొత్తపల్లి వచ్చారు. ఆయన తండ్రి వెంకట్రావు సంవత్సరీకం నిమిత్తం బుచ్చిబాబు స్వగ్రామానికి వచ్చారు. బుచ్చిబాబుతో పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.. కొత్తపల్లికి చెందిన మణికంఠ క్యాటరింగ్ యాజమాని గంపల ఈశ్వరరావు, సిబ్బందితో బుచ్చిబాబు కాసేపు సందడి చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఇంటర్నేషనల్ స్థాయికి కొత్తపల్లి గ్రామాన్ని తీసుకువెళ్లినందుకు పలువురు ఆయనను అభినందించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న బుచ్చిబాబు

పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల పొట్టగొట్టొద్దు

ప్రజాశక్తి - పెద్దాపురం

మోడల్ ప్రైమరీ స్కూల్స్ పేరుతో విద్యార్థుల తరలింపు ద్వారా తమ పొట్ట కొట్టవద్దని మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ స్కూల్, బేసిక్ స్కూల్, ప్రైమరీ స్కూల్ పేరుతో పాఠశాలలను విడగొట్టారన్నారు. దీంతో పట్టణ పరిధిలో 13 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. విద్యార్థుల సంఖ్య లేక మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఒక పాఠశాలలో విద్యార్థులను మరో పాఠశాలకు తరలించే ఆలోచన ఉంటే ఆ పాఠశాలలో ఉపాధి కోల్పోయే మధ్యాహ్న భోజన కార్మికురాలిని విద్యార్థులను పంపించే పాఠశాలకు విద్యార్థులతో పాటు పంపించాలని కోరారు. మిడ్డే మీల్స్ కార్మికులకు వేతనాలు, భోజన బిల్లులు సకాలంలో ఇవ్వకపోయినా ఎన్నో అవస్థలు పడుతూ భోజనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, ఆదిరెడ్డి మనీషా, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం కేసును సిట్‌కు అప్పగించాలి

ప్రజాశక్తి - కాకినాడ/పెదపూడి

వైసిపి ఎంఎల్‌సి అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసును సిట్‌తో తిరిగి సమగ్ర విచారణ జరిపించాలని విశ్రాంత డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెదపూడి మండలం జిమామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సాయంపై చర్చించారు. ఎస్‌పి బిందు మాదవ్‌ను కలిసి కేసు పురోగతిపై వివరా లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పటి ఎస్‌పి, కొందరు పోలీసు అధికారులు సక్రమంగా కేసు విచారణ చేపట్టలేదని, అప్పటి ఛార్జ్ సీటు చూస్తే తేటతెల్లమైంద న్నారు. ఈ కేసును సిట్‌కు అప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించి అరెస్టు చేయా ల్సిన అవసరం ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లి దండ్రులు వీధి సత్యనారాయణ, వీధి నూకరత్నం, తమ్ముడు వీధి నవీన్‌కుమార్, ఆర్‌పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిళ్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కడలి సత్యమూర్తి, కడలి కిషోర్, కోడికత్తి శీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

ద్వారంపూడిపై చర్యలు తీసుకోవాలి

దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసులో అప్పటి కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వారి అనుచరులు పోలీసు వ్యవస్థను మేనేజ్ చేశారని ఆరోపించారు. వైసిపి అధికారంలో ఉండగా ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఎవరిని పడితే వారిని నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, వారి అనుచరులు, వారి వ్యాపార భాగస్వాములు చేసిన రేషన్ బియ్యం దోపిడీ కేసు ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేకుండా ఉందని వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి అవసరమైన సాక్షాలను సేకరించి అక్రమ రవాణా చేసి కోటీశ్వరులు అయ్యారో తేల్చి ఆ డబ్బంతా వారి నుంచి రాబట్టాలని డిమాండ్ చేశారు.

సాంఘిక బహిష్కరణపై పవన్ స్పందించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మల్లం గ్రామంలో ఎస్‌సిలను సాంఘిక బహిష్కరణ చేసిన ఘటనపై నియోజకవర్గ ఎంఎల్‌ఎ, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ, ఎఐటియుసి, దళిత హక్కుల సమితి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమైక్య తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మల్లం గ్రామంలో ఆయన పర్యటించారు. సురేష్ కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరించాలని తీసుకున్న నిర్ణయం దారుణమన్నారు. దీనిపై నియోజకవర్గ ఎంఎల్‌ఎ పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు, ప్రజా సంఘాల నాయకులు తోకల ప్రసాద్, కేశవరపు అప్పలరాజు, శాఖ రామకృష్ణ, నక్క శ్రీనివాసరావు, పి.లావణ్య, భవాని పాల్గొన్నారు.

పునరావృతం కాకుండా చర్యలు

దళితుల సాంఘిక బహిష్కరణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతి జరుపుకున్న వారం రోజుల్లోనే ఇటువంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

సాయిలక్ష్మిని అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 982 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన పిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సాయిలక్ష్మిని కలెక్టర్ షాన్ మోహన్ సోమవారం అభినందించారు. ఈ నెల 15న అమరావతిలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ఎపి కార్యక్రమంలో ఆమెకు మంత్రి లోకేష్ చేతులు మీదుగా మెడల్, ల్యాప్‌టాప్ అందుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌ను డి.సాయిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

లాప్‌టాప్‌తో సాయిలక్ష్మి

ఘనంగా శ్రీ గీతం 29వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 29వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. శ్రీ గీతంలో విలువలతో కూడిన విద్యను గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అందించడం జరుగుతుం దని తెలిపారు. విద్యా విధానంలో సుదీర్ఘ అనుభవం కలిగిన కరస్పాండెంట్ వివిఎస్‌పి.చౌదరి గత 28 ఏళ్లలో వందలాదిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కరస్పాండెంట్ వివిఎస్‌పి చౌదరి మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించి 29 సంవత్సరాలు పూర్తయిందని అన్నారు. ఇన్ని సంవత్సరాల పాటు విద్యాసంస్థను నిర్వహించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది కారణమన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిధులు సత్తిబాబు, శ్రీనివాస్, గంగాధర్, వీరబాబు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

మహిళను కాపాడిన ట్రాఫిక్ ఎఎస్ఐ

ప్రజాశక్తి - కాకినాడ

అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను గమనించిన ట్రాఫిక్ - 1 పిఎస్ మహిళా ఎఎస్ఐ భావిరిశెట్టి కుమారిబేబీ ప్రాణాలతో కాపాడారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐకి వచ్చిన సమాచారంతో హుటాహుటీన జగన్నాధపురం బ్రిడ్జి మీద నుంచి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఒక మహిళ(60) ఆ ప్రయత్నంలో ఉండగా కానిస్టేబుల్స్ సిహెచ్.రఘు, ఎస్. ఫణికృష్ణ సహాయంతో ఆ మహిళను రక్షించారు. ఆ మహిళను విచారించగా రామేశ్వరం గ్రామానికి చెందిన దూళ్ల సుందరంగా గుర్తించారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు కాకినాడ 1 టౌన్ స్టేషన్‌కు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన ట్రాఫిక్ పోలీసులను పలువురు అభినందించారు.

వృద్ధిరాలుతో మాట్లాడుతున్న ఎఎస్ఐ

పిజిఆర్ఎస్‌లో రెండు అర్జీలు

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో రెండు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నాతి బుజ్జి, వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, ఎపిఎం పి.సన్యాసిరావు, ఎంఇఒ కెహెచ్.నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందుకుంటున్న ఎంపిడిఒ బుజ్జి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ

పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని ఇంటర్మీడియట్ విద్య విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు కెపి.జగదీశ్వరరావు, కార్యదర్శి ఎ.శివకుమార్, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు బిటివివి.పేర్రాజు డిఆర్‌ఒను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 నుంచి రావలసిన డిఆర్, 11వ పిఆర్‌సి బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఇహెచ్‌ఎస్ పథకంలో విశ్రాంత ఉద్యోగులకు అన్ని వ్యాధులకు అన్ని హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపుదల చేయాలని కోరారు. 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డిఆర్‌లు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కార్టూ'నిజం'



మల్లం ఘటనకు శాంతియుత పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 20న పిఠాపురం మండలంలోని మల్లం గ్రామంలో జరిగిన దురదృష్టకర సంఘటనకు శాంతియుతంగా పరిష్కరించినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘటనకు సంబంధించి పూర్వపరాలను పరిశీలించి, సాంకేతికంగా పరిష్కరించే నిమిత్తం ఆర్‌డిఒ మల్లిబాబు, పిఠాపురం తహశీల్దార్, సిఐ, ఎస్‌డబ్ల్యూఒ ఆధ్వర్యంలో శాంతి కమిటీని ఇరు వర్గాల ప్రతినిధులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్‌సి సామాజిక వర్గం నుంచి దుర్గాడ సత్తిబాబు, కాలదారి రాంబాబు, ఎద్దు సుబ్రమణ్యం, అంగులూరి నూకరాజు, కడితి కష్ణారావు, దాట్ల సూరిబాబు, కాపు నుంచి కుంపట్ల చెల్లారావు, మలిరెడ్డి రామచంద్ర రావు, రంగనాథం అప్పన్న, కొప్పన వీర్రాజు, కొండపల్లి కొండారావు, బుర్ర వీరేష్ బాబులను శాంతి కమిటీ ప్రతినిధులుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శాంతి కమిటీ తీసుకున్న నిర్ణయాలు తక్షణమే అమలులోకి వచ్చేందుకు ఇరు వర్గాల ప్రతినిధులు అంగీకరించారన్నారు. ఒక వర్గంపై విధించిన సాంఘిక బహిష్కరణను వెంటనే ఉపసంహరించాలని నిర్ణయించారన్నారు. ఇటువంటి చర్యలు ఇకపై ఎవరైనా చేపడితే, చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇరు వర్గాలు అంగీకరించాయన్నారు. సోషల్ మీడియా ద్వారా ఇరు వర్గాలకు సంబంధించిన ఎవరైనా తప్పుడు ప్రకటనలు, సమాచారాన్ని ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ములవలె కలిసి ఉంటామని, ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కార్యాచరణ చేపడతామని ఇరు వర్గాల ప్రతినిధులు అధికారుల సమక్షంలో అంగీకరించారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు ఏర్పడినచో, శాంతి కమిటీ ద్వారా అధికారుల సమక్షంలో చర్చలు జరిపి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గ్రామంలో ఇకపై ఎటువంటి సాంఘిక బహిష్కరణలు ఉండవన్నారు. పై నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎటువంటి సంఘటనలు జరిగినా, అధికారులు తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇరు వర్గాల ప్రతినిధులు అంగీకరించారన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన భానుమతి, ఇతరులు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ భానుమతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జల్లావారిపేటలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. యువజన నాయకులు షణ్ముఖరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా డీజేలు పెట్టి ర్యాలీలు చేయడం వరకే పరిమితం కాకూడదన్నారు. ఆయన జీవితం, ఆయన రాసిన భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదవడం ద్వారా ఆయన ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మానవ హక్కుల సంఘం నాయకులు పెయ్యల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, పూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు, దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ మాట్లాడారు.

నేరాలు ఘోరాలు

జాతర వివాదంలో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు పనుపులమ్మ జాతరలో శుక్రవారం రాత్రి జరిగిన గొడవలో శివకోటి గ్రామానికి చెందిన పినిశెట్టి బుజ్జిపై కేసు నమోదు చేశామని రాజోలు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. జాతరలో ఒక సినీహీరో పాటలను పదేపదే వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన చంద్రరావుపై పినిశెట్టి బుజ్జి దాడి చేశాడనిఫిర్యాదు చేశారన్నారు. చంద్రరావు ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.37వేల నగదు, ఒక కారు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వంగలపూడి గ్రామానికి చెందిన గద్దె నాని అలియాస్ జ్ఞానేంద్ర ప్రసాద్, చినకొండేపూడికి చెందిన కాండ్రు శేఖర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గద్దె నానిపై గతంలో కేసులు ఉన్నాయి.

బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానిక గొడౌన్లలో పని చేస్తున్న రాయవరం మండలం ఉలపల్లికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్ పని ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. అతను సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకునే సరికి కాకినాడ వైపు వెళ్తున్న దుర్గాడ చినబాబురాజు బైకును బలంగా ఢీకొనడంతో ఇద్దరూ కింద పడి పోయారు. ఈ సమయంలో అదే దారిలో వెళ్తున్న వ్యాన్ దుర్గాప్రసాద్‌ను ఢీకొని, సుమారు 20 అడుగుల మేర ఈడ్చుకొని పోయింది. దీంతో దుర్గాప్రసాద్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ గరగరావు ఘటనా స్థలానికి చేరుకుని అదే వ్యాన్ లో క్షతగాత్రుని కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

ఆటోను ఢీ కొన్న వ్యాను

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి చెట్టు వద్ద వ్యాను ఆటోను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం నుంచి కాకినాడ వెళ్తున్న ఆటో జాతీయ రహదారి పైకి రాగానే యానం నుంచి హోటల్ వ్యర్థాల లోడుతో కాకినాడ వైపు వెళ్తున్న వ్యాను బలంగా ఢీకుంది. దీంతో ఆటో డ్రైవర్ చిన్న, చాకచక్యంగా ఆటోను రోడ్డు పక్క చెరువులో దింపడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బొడ్డు చిన వెంకటాయపాలెంకు చెందిన కొపనాతి కామేశ్వరరావు, కొపనాతి కాసుబాబు, కొపనాతి పెదఅచ్చిరాజులకు గాయాలయ్యాయి. క్షతగాత్రలను కాకినాడ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో కామేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వ్యాను అదుపులోకి తీసుకుని కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్లను గొల్లప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు విఆర్ఒకి వచ్చిన సమాచారంతో చేబ్రోలు నుంచి దుర్గాడకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రావెల్ ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

మండలంలో 31 మోడల్ స్కూల్స్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 31 ప్రభుత్వ మోడల్ స్కూల్స్ ఏర్పాటు జరుగుతుందని డివైఇఒ ఈరంకి ప్రభాకర శర్మ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రమాంపల్లి, కాండ్రకోట, కట్టమూరు జడ్‌పి హైస్కూల్స్, పట్టణంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఎలిమెంటరీ పాఠశాలకు తరలిస్తామని అన్నారు. ఈ విధానం ప్రకారం 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఆనూరు, చినబ్రహ్మదేవం, ఆర్‌బి.కొత్తూరు, రాజీవ్ మున్సిపల్ యుపి స్కూల్స్ కొత్తగా హై స్కూల్స్‌గా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థి లాస్యకు అభినందనలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థి దడాల లాస్య నవోదయకు ఎంపికైన సందర్భంగా పాఠశాలలో సోమవారం అభినందన సభ జరిగింది. హెచ్‌ఎం ఎవిఎస్‌ఎన్.వీర్రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లాస్యను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించి నగదు ప్రోత్సాహాన్ని అందించారు. శిక్షణ ఇచ్చిన గ్రాంటు పాఠశాల ఉపాధ్యాయుడు కాశి రవీంద్రను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పోతుల రత్నకుమారి, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సభలే అభివృద్ధికి తొలిమెట్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

గ్రామ సభలే అభివృద్ధికి తొలిమెట్టు అని కూటమి నాయకులు అన్నారు. సోమవారం ఇంద్రపాలెంలో జరిగిన గ్రామ సభ పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వరంలో జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డిపట్ల.అప్పారావు, సూతి. శ్రీనివాసరావు, ఎం.గంగయ్య, .రామలింగేశ్వర రావు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.65,054 విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయంలో అన్నదానం నిమిత్తం మండలంలోని గుడివాడకు చెందిన దాత ఎస్.పవన్‌కుమార్ రూ.65,054 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావుకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ కనకాల కుటుంబం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్డీ వ్యాపారుల వేధింపుల తాళలేక మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుమారుడు శ్రీకాంత్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైస్ చైర్మన్ మహాలక్ష్మి, ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావులను మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడకు తరలించారు. వారి కుమారుడు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు లేఖ రాసి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మూడు తరాలుగా వీరి కుటుంబం 'మండపేట స్వీట్ స్టాల్'ను నిర్వహిస్తుంది. సుబ్రహ్మణ్యేశ్వరరావు ఇటు వ్యాపారం చూసుకుంటూనే అటు రాజకీయాల్లో ఉన్నారు. మహాలక్ష్మి ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఘటనా సమాచారాన్ని తెలుసుకున్న పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరామర్శించారు. ఘటనా స్థలాన్ని సిఐ విజయశంకర్, ఎస్ఐ వి.మౌనిక పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

వైస్ చైర్మన్ మహాలక్ష్మిని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

సకాలంలో పరిష్కరించేలా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, కెఎస్ఐఎన్ కెవి.రామలక్ష్మి, సిపిఒ త్రినాథ్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, మత్స్యకార భరోసా, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికెట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం 503 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

మద్దతు ధరకే కొనుగోలు చేయాలి : వర్మ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం పేరుతో రైతులను కొంతమంది కిందిస్థాయి అధికారులు రైస్ మిల్లర్ దళారులతో కుమ్మక్కై రైతులను భయపెట్టి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు నష్టం కలిగజేస్తున్నారన్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన నిధులను కేటాయిస్తుంటే కొంతమంది ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి తేమతో సంబంధం లేకుండా రైతులకు ఆమోదం కలిగిన దళారులకు ధాన్యాన్ని విక్రయించకుండా రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 80 అర్జీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్‌లోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సుమారు 80 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి అర్జీలను పాడా పీడీ చైత్రవర్షిణి స్వీకరించారు. అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపీడీ వసంతమాధవి, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహశీల్దార్ గోపాలకృష్ణ, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ప్రతీ విషయాన్ని పవన్‌కు ఆపాదించొద్దు'

జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల

ప్రజాశక్తి - పిఠాపురం

నియోజకవర్గంలో జరిగిన ప్రతి విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్‌కు, జనసేన పార్టీకి ఆపాదించొద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ అన్నారు. మల్లంలో జరిగిన పరిణామాలపై సోమవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మల్లంలో జరిగిన సాంఘిక బహిష్కరణ ఘటనను ఖండిస్తున్నామన్నారు. విద్యుత్ షాక్ ప్రమాదంలో మృతి చెందిన పి.సురేష్‌బాబుకు జనసేన సభ్యత్వం ఉందని, అతను జనసేన కార్యకర్త అన్నారు. జరిగిన ఘటనపై ఇరువురు రణలు చేసే తాము సహించబోమన్నారు. సనాతన ధర్మం అంటే అందరిని సమానంగానే చూడడమే లాజర్. కుల విభజనలో కాపు, కమ్మ సామాజిక వర్గాల వారు ఇబ్బందులు పడిన పరిస్థితులున్నాయన్నారు. ఆ రెండు కులాలను కలిపినా నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. కోనసీమ గొడవలు నేపథ్యంలో ఇరు సామాజిక వర్గాలకు చెందిన యువతను కూర్చోబెట్టి కలిపిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని గుర్తు చేశారు. మృతుడు సురేష్ కుటుంబానికి జనసేన అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా జానకి రామారావు మాట్లాడుతూ తప్పు చేసిన వారికి శిక్ష పడేలా జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ దళిత నాయకులు లాజర్ బాబు, బి ఎన్ రాజు,దేవ,సూర్య ప్రకాష్, పలువురు జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు. అనంతరం మల్లంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పి.సురేష్‌బాబు కుటుంబాన్ని తుమ్మల రామస్వామి పరామర్శించారు. రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా జనాకిరామరావు, దళిత నాయకులు బిన్.రాజు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ లాజర్ బబు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి కమిటీతో మాట్లాడుతున్న అధికారులు

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని మల్లాం గ్రామంలో జరిగిన సంఘటనపై సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని వికాస పీడీ కె.లచ్చారావు, సిఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం మల్లాం గ్రామ సచివాలయంలో శాంతి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాం గ్రామంలో ఆదివారం జరిగిన సంఘటనను ఇరువర్గాల సభ్యులు, గ్రామ పెద్దలు అధికారుల సహకరంతో సామరస్యంగా, స్నేహపూర్వకంగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ విషయంపై జిల్లా అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షిస్తుందన్నారు. కొంతమంది బయట ప్రదేశాల్లో ఉన్న వ్యక్తులు ఇరువర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు శాంతి కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక అగ్రహారం - రాపర్తి వెళ్లే రహదారిలో గత 20 ఏళ్లుగా నివాసముంటున్న ప్రజలకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు వేయాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో సిపిఎం మండల కన్వీనర్ కుంచె చిన్న ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులకు సదరు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఆ ప్రాంతంలో పర్యటించి తుప్పలు తీసివేస్తే నీటి సరఫరాకు పైపులైన్ వేస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆచరణలో ఫలితం లేదన్నారు. కావున తక్షణమే పైపులైన్ ఏర్పాటు చేయడంతోపాటు, డ్రెయినేజీ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాఘవమ్మ, సత్యవతి, సింహాచలం, పాప, చంద్రమ్మ, ఉదయభాస్కర్, ఐద్వా నాయకులు కె.మణి, వి.నాగు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

IN THE HON'BLE COURT OF
THE SENIOR CIVIL JUDGE
AT NARSIPATNAM
H.M.O.P. No. 88 / 2024
Between:
Mandapureddy Venkata Lakshmi ... Petitioner
And:
Mandapureddy Yesu ... Respondent
To:
Respondent: Mandapureddy Yesu,
S/o. Narayana, Coolie,
R/o. D.No. 3-71, Velamapeta Street
West Gondagudem (m)
Korukonda Mandal, E.G.Dist-533289.

యిందలి Respondent పై H.M.O.P.No. 88/2024 దావా పరిహార నిమిత్తము శ్రీకోర్టు వారు అదేశము ప్రకారము మీకు ఎన్నిసార్లు దావా సమన్లు (నోటీసులు) పంపించినను తీసుకోనందున శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు (సమన్లు) పంపడమైనది. సదరు విషయములు మీకు ఎట్టి ఆక్షేపణలుయున్నను **తే: 08-05-2025 దిన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనిచో మీ పై పరోక్షమున తీర్మానము చేయుదురు.

Hg. Date : 08-05-2025
RUTHALA APPA RAO
Advocate,
Narsipatnam-531116
Cell : 9849830575
Narsipatnam
Dt. 21-04-2025

నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు: డిఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

మెడికల్ కాలేజీలలో ప్రవేశానికి మే 4వ తేదీన నిర్వహించే నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిఆర్ఒ జె.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 4వన తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ నీట్ పరీక్షను కాకినాడలో 10 కేంద్రాల్లో ఒఎంఆర్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2880 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎంపిక చేసిన 10 సెంటర్లలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆయన చీఫ్ సూపరింటెండెంట్లను కోరారు. అన్ని కేంద్రాలకు కాంపౌండ్ వాల్ తప్పని సరిగా ఉండాని, కేంద్రాలన్నింటిలో సిసి కెమేరాలతో నిశిత పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా కేంద్రాలన్నింటిలో తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. పరీక్షల నిర్వహణకు రిగ్యులర్ ఉద్యోగులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించాలని, సైన్స్ బోధనా నేపథ్యం కలిగిన వారెవరినీ నియమించకూడదని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకట్రావు

CHANGE OF NAME

I, Peruri China Veerraju (NEW NAME) S/o Late Veerraju, Resident D.No.5-72, Rice Milll Street, Near Rice Mill, Devarapalli Mandalam, VTC Yernagudem, E.G.Dist., -534313, A.P Do hereby inform to the Public that my name wrongly entered in passport Peruri China Veera Raju (Old Name) has been changed to Peruri China Veerraju (New Name) for all transactions.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
I.A. No. 619/2024 in A.S. No. 6/2023
Between:
గిడ్డి రాజబాబు -పిటీషనరు/ అప్పిలెంటు
AND
కుసుమ జగదీష్‌బాబు
మరియు 12 వగయిరాలు
-రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు

12వ రెస్పాండెంటు: నల్లమిల్లి లత, D/o. లేటు పులగం సత్యనారాయణరెడ్డి, వయస్సు 44 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం. 6-15, కొంకుదురు గ్రామం, బిక్కవోలు మండలం.

13వ రెస్పాండెంటు: సత్తి అంబిక, D/o. లేటు పులగం సత్యనారాయణరెడ్డి, వయస్సు 42 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం. 6-15, కొంకుదురు గ్రామం, బిక్కవోలు మండలం.

పై నెంబరు పిటీషన్‌లో (లేటు) పులగం సత్యనారాయణరెడ్డి వారసులు అయిన 12వ రెస్పాండెంట్, 13వ రెస్పాండెంట్‌లకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిమార్లు నోటీసులు పంపించినను తీసుకొనక బుద్ధిపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. సదరు 12వ, 13వ రెస్పాండెంట్స్‌లు హాజరు నిమిత్తం **ది. 07-5-2025 సం॥ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
జి.వి.కృష్ణప్రకాష్
పిటీషనరు/ అప్పిలెంటు తరపున అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848162554

యానాం వార్తలు

డంపింగ్ యార్డ్ సమస్యపై కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి - యానాం

యానాం డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సోమవారం యానాంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్ఎఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిప్‌మెర్ ఆసుపత్రి వద్ద ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆర్ఎఒ కార్యాలయం వరకూ ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ధాన్ని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆఖరికి పోలీసులు ఆర్ఎఒ కార్యాలయం వరకూ అనుమతి ఇవ్వడంతో ర్యాలీగా వచ్చి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా వద్దకు ఆర్ఎఒ మునిస్వామి వచ్చి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నెలలుగా డంపింగ్ యార్డ్ సమస్య ప్రజలను వేధిస్తుందన్నారు. చెత్త సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అయ్యారని ఆరోపించారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదని అన్నారు. నెలలు గడుస్తున్నా సమస్యను ఎందుకు పరిష్కారించడం లేదని నిలదీశారు. ఎప్పటిలోగా పరిష్కారిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆర్ఎఒ మాట్లాడుతూ సమస్యను రెండు వారాల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నా డిఎంకె కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, సిపిఎం నాయకులు జి.దుర్గాప్రసాద్, విసికె పార్టీ నాయకులు మెల్లం శ్రీనివాస్, వర్తక సంఘం నాయకులు నల్లా వెంకన్న, పర్యావరణ పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విద్యుదాఘాతానికి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం బెజవాడ గార్డెన్స్‌కు చెందిన లంక సిద్ధార్థ మౌర్య (18) సోమవారం ఉదయం ట్యూబ్ లైట్ బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. తండ్రి లంక చినలోవరాజు ఇటీవల సీనియర్ అకౌంటు ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందారు. తల్లి లక్ష్మి యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. కాకినాడ ఆదిత్య కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతూ ఇటీవల వచ్చిన ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. అయితే ఇంటి నిర్మాణం జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబం సభ్యులు తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందించినప్పటికీ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

జోరుగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - సామర్లకోట

బడి ఈడు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు ఎన్రోల్మెంట్ కార్యక్రమం మండల పరిధిలో చురుకుగా జరుగుతోంది. సోమవారం మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో చేపట్టిన ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో ఏడుగురు విద్యార్థులనుప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు ఎంఇఒ- 1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.భైరవమూర్తి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మలా కుమారి, ఎఎంసి ఛైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చంద్రంపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలోని ముగ్గురు విద్యార్థులను డికెఎస్‌లో చేర్చినట్లు ఎంఇఒ-2 పి. పుల్లయ్య చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

గర్భిణులు, బాలింతలు, మహిళలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఐసిడిఎస్ పీడీ విజయకుమారి అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవనంలో సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు పౌష్టికాహారంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు నష్టపోకుండా ఆహారం తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవ సమయం వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎన్.ఉమాదేవి, టివి.రమణమ్మ, కె.చంద్రకళ, నిర్మల, ఎ.మంగ, సిహెచ్.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు పాల్గొని మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన చేసుకోవాలన్నారు. మందులు, ఎరువులు వాడకం ఎక్కువగా ఉండటం వల్ల అనేకమైన వ్యాధుల బారిన పడుతున్నామని అన్నారు. ప్రకృతి వ్యవసాయం పెంపొందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఎఒ గోపీనాథ్, స్థానిక టిడిపి నాయకులు పైలవేణు, ఉప సర్పంచ్ భాస్కర్‌బాబు, ప్రకృతి వ్యవసాయ శాఖ ట్రైనర్ జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

అప్రకటిత కోతలతో అవస్థలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక గణపతి నగరం గాంధీనగర్ నూకలమ్మ అమ్మవారి ఆలయం దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో తరచుగా సమస్యలు రావడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కల్గుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 1.30 వరకు కరెంటు లేకపోవడంతో వృద్ధులు, చిన్నారుల అల్లాడిపోయారు. సోమవారం అదే పరిస్థితి ఉందని, సమస్యను పరిష్కరించకపోవడంపై విద్యుత్ శాఖ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ కార్యాలయానికి ఫోన్ చేసినా సిబ్బంది బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రకటన
మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. No. 49/2023
Between :
బాదం సత్యనారాయణ ...వాది
మరియు
బాదం క్రాంతి కుమార్ సుబ్బారావు శ్రేష్టి వగైరాలు ...ప్రతివాదులు
14వ ప్రతివాది :
కారుమూరి రంగనాయకమ్మ, భర్త విశ్వనాద్, డోర్ నెం.4-5, పెద రామాలయం వీధి, దివిలి.

కోర్టు వారి ఆర్డరుపై తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తమై నోటిసులు వంపుతుండగా మీరు అందుకోకుండా ఉన్నందున, ఇందుమూలముగా తెలియచేయునదేమనగా పై నెంబరు వ్యాజ్యము వాయిదా **ది. 28-04-2025న** ఉన్నందున, సదరు తేదీన పై కోర్టువారి ఎదుట మీరు **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా కాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని గ్రహించగలరు.

కొత్త మాణిక్యాలరావు, న్యాయవాది
అన్నపూర్ణ థియేటర్ వెనుక,
కుంతి మాధవనగర్, పిఠాపురం
సెల్: 94403 41790
పిఠాపురం.
ది.21-4-2025

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 1640/2018 in O.S. 362/2018
Between:
కొండేపూడి సుబ్రహ్మణ్యం ...పిటీషనర్ / వాది
మరియు
నందూరి ప్రభాకర రామారావు మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

R6. నందూరి వెంకట లక్ష్మి అచ్యుత వల్లి, W/o. లేట్ నందూరి ప్రభాకర రామారావు, 51 సం॥లు, హిందూ, గృహిణి, R/o.డో.నెం.2-59, ఓదూరు గ్రామము, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం J.C.J.C.

R7. నందూరి సత్య వెంకట ప్రదీప్, S/o. లేట్ నందూరి ప్రభాకర రామారావు, 24 సం॥లు, హిందూ, స్టూడెంట్, R/o.డో.నెం.2-59, ఓదూరు గ్రామము, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం J.C.J.C.

R8. నందూరి ఎస్.ఎస్.వి.ఎస్. లలిత స్వాతి, D/o. లేట్ నందూరి ప్రభాకర రామారావు, 21 సం॥లు, హిందూ, స్టూడెంట్, R/o.డో.నెం.2-59, ఓదూరు గ్రామము, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం J.C.J.C.

పై నెంబరు పిటీషన్ నందు R.6, 7 మరియు 8 రెస్పాండెంట్స్/ప్రతివాదులు హాజరు నిమిత్తం **ది. 25-04-2025న** వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు పిటీషన్ ను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
కముజు సూర్యనారాయణ, పిటీషనర్ తరపు అడ్వకేట్
రామచంద్రపురం. సెల్: 98493 79828
డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
తేది: 21-04-2025

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
A.S. No. 6/2023
Between:
గిడ్డి రాజబాబు -అప్పిలెంటు
AND
కుసుమ జగదీష్‌బాబు
మరియు వగయిరాలు -రెస్పాండెంట్లు

1వ రెస్పాండెంటు: కుసుమ జగదీష్‌బాబు, తండ్రి: చిట్టిబాబు, వయస్సు 41 సం॥లు, వ్యాపారము, డోర్ నెం. 1-20-3, రాజరపు వారి స్ట్రీట్, కొండయ్యపాలెం, కాకినాడ.

5వ రెస్పాండెంటు: నాగళ్ళ జానకిరామయ్య, తండ్రి: వెంకన్న, వయస్సు 63 సం॥లు, వ్యాపారము, డోర్ నెం. 1-234, అచ్చంపేట, సామర్లకోట మండలం.

6వ రెస్పాండెంటు: నాగళ్ళ అనంతలక్ష్మి, W/o. జానకిరామయ్య, వయస్సు 58 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం. 1-234, అచ్చంపేట, సామర్లకోట మండలం.

7వ రెస్పాండెంటు: నాగళ్ళ మురళి శ్రీనివాస్, తండ్రి: జానకిరామయ్య, వయస్సు 39 సం॥లు, వ్యాపారము, డోర్ నెం. 1-234, అచ్చంపేట, సామర్లకోట మండలం.

పై నెంబరు అప్పీలు నందు 1వ, 5వ, 6వ, 7వ రెస్పాండెంట్‌లకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిమార్లు నోటీసులు పంపించినను తీసుకొనక బుద్ధిపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. సదరు రెస్పాండెంట్స్ హాజరు నిమిత్తం **ది. 07-5-2025 సం॥ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
జి.వి.కృష్ణప్రకాష్
పిటీషనరు/ అప్పిలెంటు తరపున అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848162554